# వికృతి

-దాట్ల దేవదానం రాజు

సందడి... చుట్టూరా జనం... చీమల దండులా పోగుపడి... రైల్వేస్టేషన్ అంతటా గోలగోలగా వుంది. సామర్లకోట కూడలి... మున్నెన్నడూ లేనంత హడావుడి... అరుపులు. ఆర్.టి.సి. సమ్మె మూలంగా మరింత రద్దీ... గత్యంతరం లేని పక్షులు ఒకే చెట్టుని చేరినట్లు. స్టేషన్ బయట గలాభా...

సఫారీ సూట్‌వాలా రిక్షావాడితో... గొడవ పడ్తూ.... ఊగిపోతున్నాడు.

రిక్షావాడు ఇంకా రెచ్చిపోతూ.... కేకలు. ఇద్దరకూ ఇద్దరే.

ఎవరి మాటా... ఎవరి వాదనా... వారిదే.

విషయం తెలుసుకుని ఆశ్చర్యపోవడం నా వంతైంది.

“ఎల్లవయ్యా, పెద్దమనిషిలాగున్నావు. ఒక్క రూపాయి కోసం వూరికే గడబిడ చేసేత్తున్నావ్. మీ అసుంటి వాళ్ళకు ఇదో లెక్కా కాల్చి పారేసిన బీడీ ముక్కగానీ...!”

“రూపాయైనా వందైనా వొకటే. ఎందుకివ్వాలి? నువ్వడిగిందానికి రూపాయి తగ్గించుకోమని ముందే చెప్పాను. మాట్లాడకపోతే అంతే అనుకున్నాను.” “పోనీలెద్దురూ, వాడితో గొడవేంటి? రూపాయేగా పారేద్దురూ” ఒకాయన సలహా ఇచ్చాడు.

“ఇవ్వనండీ. ఒక్క పావలా కూడా ఎక్కువియ్యను. ఇవ్వనంటే ఇవ్వను. దిక్కున్న చోట చెప్పుకో”

“ఇదిగో బాబూ, ఎందుకొచ్చిన గొడవ? ఆయన దగ్గర చిల్లర లేదేమో. నేనిస్తున్నాను. ఈ రూపాయి తీసుకో” అని రిక్షావోడి చేతిలో పెట్టాను.

ఆయన నాకేసి తీక్షణంగా చూశాడు. రిక్షావోడు రణపెంకిలా వున్నాడు. తీసుకోలేదు. విసురుగా నా చేతిలో పడేశాడు.

“ఆ రూపాయితో నువ్వే ఊరేగు. బిచ్చమేశాననుకుంటాను” రిక్షావోడు సీటెక్కి పెడలు మీద కాలేశాడు.

సఫారీ ఆయన హేండిలు పట్టుకుని ఆపు చేశాడు.

నలుగురిలో అవమానాన్ని దిగమింగుకునే ప్రయత్నం.

కళ్ళల్లో రోషాగ్ని...

“నా దగ్గర చిల్లర లేక కాదు. ఇదిగో ఇటు చూడు”

అంటూ గుప్పెడు నిండా చిల్లర చూపించాడు.

తిరిగి జేబులో చిల్లర కుక్కుకుని హేండిలు వదిలేశాడు.

సూట్‌కేస్‌తో స్టేషన్‌లోకి నడిచాడు. నేను అనుసరించాను.

“అలగా జనాలకి లోకువ ఎవరిస్తున్నారు? మనమే.

కొంచెం చోటిస్తే నెత్తికెక్కి కూర్చుంటారు” నాకేసి తిరిగి అంటున్నాడు.

నేను మాట్లాడలేదు.

ఆయన్ని ఇంతకుముందే ఎక్కడో చూసిన జ్ఞాపకం.


గుర్తుకు రావడం లేదు.

పోలికలు అస్పష్టంగా... మసక చీకటిలోని ఆకారానికి చిత్రం గీస్తున్నాను.

ఉపాధ్యాయ వృత్తిలో వున్నవాళ్ళకు వచ్చే ఇబ్బందే ఇది.

ఎవరూ కొత్తగా కనిపించరు. ఒక పట్టాన జాడలు పట్టలేరు.

నేను మరీను. ఎదుటి వాళ్ళే కొన్ని బండ గుర్తులు చెప్పాలి.





“ ఎక్కడ చూసానబ్బా?” పొరలు లాగుతున్నాను.

ఎక్కాల్సిన రైలు... పట్టాల మీద సిద్ధంగా వుంది. ప్లాట్‌ఫామ్ మీద మనుష్యుల్ని తప్పించుకుంటూ స్లీపర్ కోచ్‌కేసి నడిచాను.

నెంబర్ల్ని వెదుక్కుంటూ... సామాన్లు మోసుకుంటూ...

హడావుడిగా జనం... కంపార్ట్‌మెంట్‌లో పెట్టె సీటు కిందకు తోసి కూర్చున్నాను.

ఆయాసంగా.. రొప్పుతూ... సఫారీ సూట్‌వాలా నేనున్న చోటుకే వచ్చాడు.

విచిత్రంగా ఆయన సీటు నా పక్కనే.

సీరియస్‌గానే వున్నాడు. కళ్ళు అటూ ఇటూ తిప్పుతూ కోపంగా...

ఇందాకటి సంఘటన నుంచి ఇంకా తేరుకోలేదు.

ఆయనతో పరిచయానికి మాటలు కలపాలి. గతంలో ఎక్కడ కలిశామో తెలుసుకోవాలి. అడుగుతున్న వాటికి అయిష్టంగా సమాధానాలు చెబుతున్నాడు.

ఆయన పేరు నిరంజన్‌రావు. ప్రభుత్వోద్యోగం నుండి పదవీ విరమణ చేశాడు. హైదరాబాదులో ఉన్న కొడుకు దగ్గరకే ప్రస్తుత ప్రయాణం. పొడి పొడి మాటల్ని సాగదీయడం కష్టం.

కొన్ని నిశ్శబ్ద క్షణాలనంతరం నా వివరాలు అడిగాడు.

వృత్తి విషయాలు విన్నాడు.

రచనా వ్యాసంగం గురించి చెప్పాను, గొప్పగా గర్వంగా ఫీలవుతూ.

కనుబొమలు చిట్లించి ఒక్కసారి తేరిపార చూసి విరగబడి నవ్వాడు.

నిర్మలంగా... అమాయకంగా... చూస్తున్నాను.

“ఇపుడెవరూ కొత్తగా ఏమీ రాయనక్కర్లేదు. ఎవరేం రాసినా అవి ఎపుడో ఒకప్పుడు ఎవరో రాసేసిందే అయ్యుంటుంది. మన పూర్వీకులు టచ్ చేయని సబ్జెక్టు లేదు. అర్థం చేసుకోవాలంతే. ఏదైనా ఇప్పటి ఒక రచన చెప్పండి. అది ఎప్పుడు ఎలా రాయబడిందో చెబుతాను. ఒకప్పుడు నేనూ గట్టిగా చదివిన వాడినే. ఇపుడు చదవాలనే ఆసక్తి

ఎవరికీ వుండటం లేదు. ఎవరో అన్నట్టు బుక్ రీడింగ్ పోయి లుక్ రీడింగ్ వచ్చింది. మీరూ ఇక రాయకండి. మీరు రాసేది ఎవరు చదువుతున్నారో మీకే తెలియనపుడు ఎందుకు రాయాలి? కాలాన్ని బట్టి పోతూ కలాల్ని విసిరేయండి." ఆయన ధోరణికి అడ్డుకట్ట వెయ్యకపోతే జన్మలో కలాలు ముట్టలేం.

అగ్నిలో తగులడుతున్న తెల్లకాగితాలు, రకరకాల పెన్నులూ... బూడిద అయి... శరీరాన్ని వణికిస్తూ... దిగులు మేఘాలు కమ్ముకుంటుండగా...

తక్షణ కర్తవ్యంగా మాటలు ప్రవాహపు దారి మళ్ళించాను.

మేమిద్దరం కాక మిగిలిన వాళ్ళందరూ కుర్రాళ్ళే.

చలాకీగా... జోకులేసుకుంటూ... కొత్తగా వస్తున్న ప్రేమ సినిమాల్లోని హీరోల్లా... ఫ్రెష్‌గా... ఇప్పటి యువకులంతా... అందమైన లోకాల్ని కలగంటూ... ఆధునికమైన వేషభాషలు.. ప్రతీ విషయం ఈజీగా తీసుకునే మనస్తత్వం...

ఏవేవో ఊహించుకుని ఒత్తిళ్ళు పెంచుకోవడం సుతరామూ ఇష్టం వుండదు. సెంటిమెంట్లని పట్టుకుని వేళ్ళాడుతూ...

అసలు కుదరదు.

"మొదలెడ్దామా?" అంటున్నాడొకడు.

"ఒక్క పది నిముషాలు ఆగు"

"టైం వేస్టు కదా...?" కాలం విలువ తెలుసున్న వాడిలా...

ఒకటే కంగారు.

మొదలెట్టబోయేది ఏమిటో... ఉత్సుకత నాలో. నిరంజన్‌రావు సిగరెట్టు వెలిగిస్తున్నాడు. దీపాన్ని పెదాలు ముద్దుపెట్టుకుంటున్నట్టు... స్వచ్ఛమైన గాలికి ధూళి పులుముతున్నట్లు... ఊపిరులు ఖరాబవుతూ...

పబ్లిక్ ప్లేస్‌లో సిగరెట్లు తాగడం నిషేధం... సుప్రీంకోర్టు ఆదేశాలు. సిగరెట్టు కంపెనీ వాళ్ళు వకవకా నవ్వుతారు, రోడ్లు, హైవేలు వొదిలేసినందుకు.

సిగరెట్టు పొగ పడదు నాకు.

## ఉత్కంఠ?

నాలుగు దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో శ్రీ స్వామి గారు చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా నగరంలో భారీ సన్మాన సభ ఏర్పాటు చేశారు. స్థాయికి తగినట్లు పబ్లిసిటీ కూడా చేశారు. సభాదినం ఆసన్నమైంది. జనం అంచనాలకు మించి విచ్చేశారు! ముఖ్య ఆర్గనైజర్ ఆహ్వానం పలుకుతూ- 'స్వామి గారు ఆయా రంగాలకు చేసిన సేవకు తార్కాణం ఏమిటంటే- ఇంతమంది అభిమానులు తరలిరావడమే...' అని ఆవేశంగా మొదలుపెట్టాడు. '...అదేం కాదు. అసలు ఈ నలభై ఏళ్లలో ఆ యొక్క రంగాలలో వారేం చేశారో తెలుసుకోవాలనే వుత్కంఠతో మేమంతా వచ్చాం' అని ఖంగున విన్పించిందో కంఠం ఆడియన్స్‌లోంచి.

**- శ్రీరమణ**

అయిష్టంగా... కంపరంగా... భరిస్తున్నాను.

ఒక కుర్రాడు బ్యాగ్ తెరచి పేకలు బయట పెట్టాడు.

పేకలకు వేళ్ళు తగిలించి 'తల్లి మాలచ్మి' అంటూ కళ్ళకద్దుకున్నాడు మరొకడు. నలుగురు కుర్రాళ్ళూ హోమం చుట్టూ కూర్చున్న ఋత్విక్కుల్లా....

నిరంజన్‌రావు మెరుస్తున్న కళ్ళు... పేకల్ని చూస్తున్నాయి.

"నేనూ మీతో ఆడ్తాను" అన్నాడు నిరంజన్‌రావు ముందుకు వచ్చి.

యువకులు ముఖముఖాలు చూసుకున్నారు. సాధారణంగా కొత్తవాళ్ళని పేకలో కలవనివ్వరు. మరీ ముఖ్యంగా... పెద్దరికాల్నీ, అధికారాల్నీ. వస్తే పోతే డబ్బులన్నీ వాళ్ళ మధ్యే తిరగాలనేది ఒక కారణం. కొత్తగా వచ్చినవాడు బాగా గెలిస్తే అతన్నుండి ఎపుడైనా రాబట్టుకునే ఆశలుండవు. పారేసుకున్న చోటే ఏరుకోవాలనే మాట ఎప్పటికప్పుడు ఓడుతూ కూడా మరీ మరీ

ఆడిస్తుంది. వాళ్ళు ఈయన్ని చేరనివ్వరనే అనుకున్నాను.

అలా జరగలేదు.

కళ్ళతో మాట్లాడుకుని... అంగీకారంగా ముక్కలు పంచారు.

నిరంజన్‌రావు పక్కకు చేరాను. రమ్మీ నాకూ తెలుసు.

నిరంజన్‌రావు పేక పరిశీలనగా చూశాను. నిక్షేపంగా డ్రాప్ చేసేయ్యొచ్చు.

ఆడటానికి నిశ్చయించుకుని వంగొని బొత్తిలోంచి ముక్క కోశాడు.

రెండు మూడు కలుపులు అయ్యేటప్పటికి నిరంజనరావు మానసిక స్థితిపై రవ్వంత అనుమానం. ఏ ఆటా డ్రాప్ చెయ్యడం లేదు. కిందనున్న వాడికి ఒక్క ముక్క కూడ ఎక్కనివ్వడంలేదు. అవసరమైతే మంచి పెయిర్‌ను కూడా విడదీసి డిస్కార్డ్ చెయ్యడానికి సందేహించడం లేదు. పైగా పేక పేర్పు కూడా విచిత్రంగా వుంది.

జట్లుగా సర్దడంలేదు. ఒకదానికొకటి సంబంధం లేకుండా బాగా కలిపిన ముక్కల్లా పేకను ఉంచుతున్నాడు. ఎవరికీ ఆయన పేక అర్థం అవ్వదు. ఎపుడైనా షో చూపించాల్సిన సందర్భంలో సీక్వెన్సులుగా పేర్చి చూపిస్తున్నాడు.

గొప్ప అనుభవం, అలవాటు ఉన్న వాడిలా వేగంగా ఆడుతూ... నిరంజనరావు. అయినా చాలా డబ్బులు పోగొట్టుకున్నాడు. కుర్రాళ్ళకు నిరంజనరావు బాగా నచ్చాడు. మొహమాటాలు, బిడియాలు లేవు. సీరియస్‌గా ఆడుతున్నపుడు కూడా... చనువుగా... సంబోధించుకుంటూ... కుర్రాళ్ళలో కుర్రాడిగా బాగా కలిసిపోయాడు.

నాకే ఆయన ధోరణి విపరీతం అనిపించింది.

గేటు ముందరి రిక్షావాడు జ్ఞాపకం వచ్చాడు. వాడికి ఒక్క రూపాయి ఇవ్వడానికి .మనసు ఒప్పనివాడు... ఇపుడు ధారాళంగా డబ్బులు విసురుతూ... ప్చ్... ఏమిటో నిరంజనరావుతో పరిచయం నా బుర్రకి ఇంకా అందలేదు. ఇట్టే దొరికి దూరంగా పోతోంది. నిరంజనరావు ముఖ కవళికలు మరీ ఒత్తయిన పొరల మధ్య ఇరుక్కోలేదనే అనిపిస్తుంది.

రెండు గంటలు సాగింది ఆట. నిరంజనరావు అధమ పక్షం రెండు వేలన్నా కోల్పోయుంటాడు.

అయినా నవ్వుతూ... చలాకీగా... వాళ్ళతో సమంగా జోకులు పేలుస్తూ... గడిపాడు.

"మీరెప్పుడైనా యానాం వచ్చారా?" అడిగాను.

" ఎందుకు?"

"మిమ్మల్నెక్కడో చూసినట్టుంటేనూ..."

"మీది యానామా. ఒకసారి యానాం రావాలనుకునే మానేశాను. అక్కడేమైనా స్మగుల్డు గూడ్సు అమ్ముతారా? మందు చవకగా దొరుకుతుందట కదా. తాగేసి రోడ్డు వార దొర్లుతుంటారట, నిజమేనా? తాగి దొర్లిపడాలనే యానాం వద్దామనుకున్నాను" సీరియస్‌గానే అంటుంటే కుర్రాళ్ళు గొల్లుమని నవ్వారు.

"మీకలాంటి కోరికేమిటి బాబూ, అసహ్యంగా"

"మీకర్థం కాదులెండి. చెప్పుకుంటే తీరని థ్రిల్లు అనుభవించాలంతే" అంటూ నవ్వి లేచి నిలబడి టాయిలెట్ కేసి నడిచాడు.

నిరంజనరావు అలా వెళ్ళాడో లేదో చటుక్కున.. పొరలు విడి ఒక జ్ఞాపక శకలం తాకింది నన్ను. ఒకనాటి దృశ్యం కళ్ళముందు కదలాడింది.

రాజమండ్రిలో ఒక బారులో కలిశాడు. ఆ రోజు మిత్రుడిచ్చిన పార్టీకి వెళ్ళాను. మొత్తం ఆరుగురం వున్నాం. నేను కూల్‌డ్రింకు చప్పరిస్తున్నాను. ఎపుడైనా పుచ్చుకునే అలవాటు కూడ అపుడు లేదు నాకు. మిఠాయి కొట్టులో ఉన్నవాడికి స్వీటు రుచించదన్నట్టు 'యానాంలో వుండి కూడా' అని వేళాకోళం ఆడేవారు మిత్రులు. ఎవరెంత బలవంతం చేసినా నియమాన్ని విడవలేదు.

రెండో రౌండు అవుతుండగా నిరంజనరావు అక్కడికొచ్చాడు.

ఆ రోజు కూడా సఫారీలోనే వున్నాడు. చేతిలో సగం తాగిన గ్లాసు. కొద్దిగా తూలుతూ మా దగ్గరకొచ్చి నిలబడ్డాడు. మమ్మల్నెంతో ఆప్యాయంగా పలకరించాడు.

# 'వే'లు మహిమ

'అన వేమన' అనే రాజుగారి దగ్గరికి వెళ్లి కవి ఈ క్రింది విధంగా శ్లోకం చెప్పాడట:

"అన వేమ మహీపాల స్వస్త్యస్తుతవ బాహవే,
ఆహా వే రిపు దోర్దండ చంద్రమండల రాహవే!"

ఈ శ్లోకము విని ఆ రాజు కవి గారికి మూడు వేల వరహాలు పారితోషికమిచ్చాడట. కవి "నేను నాల్గు 'వే'లు ('వే' అను అక్షరాలు) ఇచ్చాను. మీరు మూడు వేలే ఇచ్చారు" అన్నాడట. రాజు నాల్గు వేలు ఇచ్చాడు. "మేమిచ్చిందే తిరిగి మాకిచ్చి పంపుతారా మహారాజా?" అన్నాడట కవి. రాజు ఐదు వేలు ఇచ్చాడు. "మేమార్వేల నియోగులము. మమ్మల్ని తక్కువ చేయటం మీకు భావ్యమా?" అన్నాడట కవి. అంతట రాజు ఆ కవికి ఆరు వేలు ఇచ్చాడు. "నేను పుట్టుకతోనే ఆరువేల వాడను" అని కవి అంటే, సరేనని ఏడు వేలు ఇచ్చాడట రాజు. "ఏడు సంఖ్య మంచిది కాదుకదా మహారాజా?" అని చమత్కరించాడట కవి. చివరికి పుచ్చుకున్న ఎనిమిది వేలతో రాజుని అప్పటికి వదిలిపెట్టాడు కవి.

*(సేకరణ: మామిడి మహేంద్ర)*

'బేరర్' గట్టిగా, ముద్దగా పిలిచాడు.

'సార్' అంటూ వచ్చాడు వాడు.

గంభీరంగా "ఈ నా కొడుకులందరికీ తలో పెగ్గ యియ్యి. పుణ్యం మనదే. బాబూ, కొడుకుల్లారా...! అందరికీ తలో నమస్కారం. మందు దానాన్ని వద్దనకుండా స్వీకరించి మమ్మల్ని ఆనందింపజేయండి. ఇది నా ఆరోగ్యం కోసం, పుట్టినరోజు సందర్భంగా, అందరూ తాగండి" వంకరగా చేతులు జోడించి వింతగా నవ్వుతూ.

"మాకొద్దండి. మాక్కావలసిన మందు వుంది"

"కుదరదు. కుదరదంటే కుదరదు. మీరు వొద్దంటే ఖాళీ సీసా పగలకొట్టుకుని పొడుచుకుని చస్తాను.

వద్దనకండి నాయనలారా...!" అంటూ ఏడవడం మొదలెట్టాడు. బేరర్ నా చెవి దగ్గరకొచ్చి గుసగుసలాడేడు.

మమ్మల్ని ఏమీ అనుకోవద్దని కోరాడు. చాలా మంచివాడైన డైలీ కష్టమరంట. ఆయన చెప్పింది వినండని ప్రార్థించాడు. అలాగే చేశాం అపుడు. ఇన్నాళ్ళకు కనిపించాడు మళ్ళీ.

నిరంజనరావు టాయిలెట్ నుండి వచ్చాడు.

ఆనాటి రాజమండ్రి సంఘటన గుర్తు చేశాను.

'అదో సరదా' అంటూ నవ్వాడు. యువకులు తమ బెర్తులలో పడకలేశారు.

టీ.సీ. వస్తున్నాడు. టీ.సీ.ని దూరంగా చూడగానే నిరంజనరావు జేబులు వెదికాడు. టిక్కెట్టు కనిపించలేదు. పెట్టె తెరచి చూశాడు. పది నిముషాలు వెదగ్గా ఆఖరికి పర్సులోనే కనిపించింది. అప్పటికి టీ.సీ. దగ్గరకు రానే వచ్చాడు.

విసుగ్గా కోపంగా టిక్కెట్టును ముక్కలుగా చింపి కిటికీలోంచి బయటకు విసిరేశాడు. ఏమీ ఎరగనట్టు మామూలుగా కూర్చున్నాడు.

ప్రయాణం టిక్కెట్టుని చింపడం... మతి స్థిరంగానే వుందా?

నిరంజనరావు మౌనంగా... ఆత్రుత నాలో... ఏం జరగబోతోంది?

టీ.సీ. వచ్చాడు. యువకుల్ని లేపి టిక్కెట్టు అడిగాడు.

తన దగ్గర టిక్కెట్టు లేదన్నాడు నిరంజనరావు.

ఫైన్ కట్టాలన్నాడు టీ.సీ. కట్టుకో అన్నాడు.

భారీగా వడ్డించాడు. అడిగినంత మాట్లాడకుండా ఇచ్చేసాడు నిరంజనరావు.

చిద్విలాసంగా నాకేసి తిరిగాడు.

"అలా ఎందుకు చేశారు?"

"ఇపుడు నేనిచ్చింది నా కష్టార్జితం. మీ డబ్బు కాదు కదా.

నా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాను"

"చాలా చిత్రంగా కనిపిస్తున్నారు. అనవసరంగా డబ్బులు పాడు..."

"నా డబ్బులే కదా, మధ్యలో మీకెందుకు? ఆఖరి నిముషం వరకూ దాచుకున్న టిక్కెట్టు కనిపించలేదు.

దొరక్కపోతే ఏం చేసే వాడినో ఇపుడూ అదే చేశాను."

సమాధానం ఉండదు ఎవరి దగ్గరా.

ఎయిర్‌పిల్లో ఊదుకుని దుప్పటి తీసుకుని పడుకున్నాను.

మానసిక అశాంతి... ఎన్ని కథలైనా నడుపుతుందేమో.

భిన్న రకాల మనుష్యులు... అర్థాలు వెదకడం... వృథా ప్రయాస.

రైలు ఆగింది.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్... జనం దిగుతున్న చప్పుళ్ళు.

నిరంజనరావుని లేపాను. యువకులు గుడ్ మార్నింగ్ చెప్పారు.

కళ్ళు నులుముకుంటూ నెమ్మదిగా లేచాడు.

స్టేషన్ బయటకొచ్చాను.

చలిగా వుంది. మంచుతెరలలో ఆటోలు..

"మీరూ రండి. మిమ్మల్ని నాంపల్లి కేర్ దగ్గర దింపివెళ్తాను" అన్నాడు ఒక ఆటో దగ్గర నిలబడి.

ఆటో గీచిగీచి బేరం ఆడాడు.

ఆయన పక్కన కూర్చున్నాను.

సిగరెట్టు వెలిగించాడు. వికారం... కడుపులో తిప్పుతున్నట్లు...

కళ్ళు చిట్లించాను.

నా వాలకం గమనించి సిగరెట్టు దూరంగా పారేశాడు.

"దేశం నాశనం అయిపోతోంది. నాయకుల్లో గానీ, ఉన్నతోద్యోగుల్లో గానీ నీతి నియమాలు లేవు. విలువలు మంటగలిసిపోతున్నాయి. అక్రమంగా ఎంత వీలుంటుందో అంతా దోచేస్తున్నారు" ఏవేవో మాట్లాడేస్తున్నాడు.

నాంపల్లిలో దిగాల్సిన చోటు వచ్చింది.

తనూ కిందకు దిగాడు.

"రాత్రి డబ్బులు పాడు చెయ్యడం గురించి అడిగారు కదా. ఇపుడు చెబుతున్నాను వినండి. మొన్నామధ్య ఓ రిటైర్డు ఉన్నతోద్యోగి అవినీతి గురించి పేపర్లలో పడింది, చూశారా? లాకర్‌లో లక్షల కొలదీ బూజుపట్టిన నోట్ల కట్టలున్నాయని, ఇంకా అనేక ఆస్తులున్నాయని, ఖర్చు పెట్టకుండా దాచుకున్నాడని చదివారా అది"

"చదివాను."

"నా దగ్గరా అలాంటి డబ్బు చాలా వుంది. నేనూ అలాంటి వాడినే. ఆ తెలివి తక్కువ వాడిలా నేనుండను. వాడి మీద పడినట్లు నా మీద ఎవరూ జాలిపడకూడదు. వస్తాను. ఎపుడైనా కలుద్దాం" అని ఆటో ఎక్కి మరల దిగి – "మరో సంగతి. నా సరదా అయిన హాబీ చెప్పనా. ఏదైనా ఖరీదైన షాపులో విలువైన వస్తువుని అతి లాఘవంగా జేబులో వేసుకోవడం. ఒకవేళ దొరికితే ఎన్ని డబ్బులైనా కట్టేస్తాను. దొరక్కపోతే ఆ వస్తువే ఎంతో ముద్దు నాకు. ఆలోచించి బుర్ర పాడుచేసుకోకండి. వుంటాను"

విస్మయం... ఆందోళన కలగలిపి... సుతిమెత్తగా నీడలు పరచుకుంటూ... పగిలిన రూపం... పెటీల్మని ఎముకలు విరిగిన చప్పుడు. ధూళిలో కొట్టుకుపోతూ... ఎవరికి వారే ఉరుకులు పరుగులుగా పంచుకుంటున్న... ఆత్మలు రంగు రంగుల లేడిలా చెంగున గెంతుతూ మోహాల్నీ ఉల్లాసాన్నీ మోసుకుంటూ ఒక రిక్షా వోడిని మరో ఆటోవాడిని చీల్చుకున్న వైనం... నిలవనీయదు నన్ను.

నాలోని సందేహాలు మరింత పెరిగిపోకుండా...

"రావు గారూ" అంటూ బిగ్గరగా పిలిచాను. అప్పటికే ఆటో దూసుకుపోయింది. ❀